చర్చ :

# మార్క్సిజం - సాహిత్యం

మార్క్సిజం-సాహిత్యం అనే శీర్షిక క్రింద రాస్తూ సురేంద్రరాజు[1] త్రిపురనేని మధుసూదనరావు వ్యాసం[2]లో లేని యాంత్రికత దానికాపాదించి, ఉత్తరోత్తరా దాన్ని మార్క్సిస్టు లందరికీ (మార్క్స్‌ను, ఎంగెల్స్‌ను మినహాయించి) సాధారణీకరించి, దాని ఆలంబనగా మార్క్సిస్టులందరినీ దుయ్యబట్టాడు. త్రిపురనేని వ్యాసంలో యాంత్రికత లేదని విపులంగా వివరించేకంటె, సురేంద్రరాజుకర్థమయిన గతితర్కం ఏమిటో చూడటం సరయిన పద్ధతి. ఆ క్రమంలోనే అతని ఆక్షేపణల నిజానిజాలు బయటపడతాయి.

'నిర్దిష్ట సామాజిక స్థితిగతులలోనే తన జీవన విధానం నిర్ణయించుకోగల స్వేచ్ఛ' వ్యక్తికి వున్నట్లు మార్క్స్ అంగీకరించాడని, చరిత్రలో వ్యక్తిగత అంశానికి మార్క్స్ ప్రాముఖ్యత వున్నట్లు చెప్పాడని, కళలకు భౌతిక వుత్పత్తికీ అసమానత మార్క్స్ ఒప్పుకున్నాడని, అయితే వీటన్నింటినీ మార్క్సిస్టులు కాదంటున్నారన్నది సురేంద్రరాజు ముఖ్యమయిన ఆరోపణ. అయితే ఈ 'స్వేచ్ఛ' గురించి, 'వ్యక్తిగత అంశం' గురించి, 'అసమానత' గురించి గతితార్కిక భౌతికవాదం ఏమంటున్నదో, వాటిని సురేంద్రరాజు ఏ విధంగా అర్థంచేసుకున్నారో చూడాలి.

మార్క్సిజం సమాజానికి పునాది భౌతిక వాస్తవమని, చైతన్యం కాదని నమ్ముతుంది. ఈ కారణంచేత బూర్జువా సామాజిక శాస్త్రంలాగ మార్క్సిస్టులు మనుషుల ప్రవర్తన గురించి, మనస్తత్వం గురించి, సూత్రీకరించలేదు. మనుషులందరు గూడ హేతుబద్ధంగానో లేక ఆర్థిక అవసరాలననుసరించో, లేక మరే ఒక్క ప్రేరణకు లోనయ్యో ప్రవర్తిస్తారని అనలేదు. ఫలానవ్యక్తి ఏ వర్గానికి చెందినవాడన్నది గూడ నిర్ణయాత్మక స్వభావాన్ని కలిగివుంటుందనలేదు. వర్గచైతన్యం అంటే ఆ వర్గంలో అందరికీ సాధారణంగా వుండే చైతన్యం అనికాదు. ఆర్థిక సంబంధాలలో ఆ వర్గానికున్న స్థానంనుండి సహజంగా పుట్టే చైతన్యం. కాని ప్రతిసందర్భంలోను, ప్రతి ఒక్కరిలోను ఈ చైతన్యానిదే పైచేయి కానక్కరలేదు.

మరి సమాజంలో మనుషుల కార్యాచరణ మాటకొస్తే, దానికి ప్రేరణ "ఆదర్శాలనుండి గాని, ఆశయాలనుండి గాని, 'సత్యాన్వేషణ, ధర్మాన్వేషణ'ల నుండిగాని, ద్వేషంనుండిగాని, మరే వ్యక్తిగతమయిన చాపల్యంనుండిగాని రావచ్చు" అని ఎంగెల్స్ ఒకచోట అన్నాడు.[3] అంటే ఎంగెల్స్ సురేంద్రరాజుకు రావలసినంత

'స్వేచ్ఛ' యిచ్చాడు. అయితే ఈ వైవిధ్యం నుండి, ఈ గందరగోళంనుండి వుత్పన్నమయే చరిత్ర సూత్రబద్ధంగా వుంటుంది. స్థూలంగా దాని పరిణామాన్ని వూహించడానికి వీలవుతుంది. భౌతికశాస్త్రంలో విభిన్నశక్తులు ఒకచోట కేంద్రీకరించబడ్డప్పుడు అవన్నీకలిసి వాటి ఫలితమైన ఒకే ఒకశక్తితో సమానమయిన ప్రభావాన్ని కలిగివుండడాన్ని ఎంగెల్స్ ఇక్కడ సామ్యంగా చెప్పాడు[4]. ఆధునికంగా చెప్పాలంటే పరమాణువులోని ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు నిర్ణయాత్మక గతిసూత్రాలకు లోబడకపోయినా వాటిచేత నిర్మించబడే పదార్థపు పరిణామసూత్రాలు గణిత సమీకరణ రూపం తీసుకొనేంతటి నిర్ణయాత్మకతను కలిగివుంటాయి. నిజానికి ఆధునిక భౌతికశాస్త్రం నుండి ఎంగెల్స్ ఇచ్చినటువంటి వుదాహరణలు చాల ఇవ్వవచ్చును.

కాబట్టి 'తన జీవన విధానం నిర్ణయించుకోగల స్వేచ్ఛ' వ్యక్తికి వుందాలంటే ప్రతివ్యక్తి తనకది వుందనే అనుకుంటాడు. వ్యక్తిపరంగా చూస్తే అది నిజమే. కాని చరిత్రపరంగా చూస్తే భ్రమ. చరిత్రపరంగా (అంటే శాస్త్రీయంగా) చూస్తే 'తనయిష్ట ప్రకారం' నడుచుకునే వ్యక్తి ఏదో ఒక చారిత్రక శక్తికి, అంతిమంగా ఒక వర్గానికి, ప్రాతినిధ్యం వహిస్తాడు. బ్రిటిష్ హయాంలో ప్రతివ్యక్తికి పోలీసు వుద్యోగం చేయాలాలేదా అని నిర్ణయించుకునే స్వేచ్ఛవుండేది. కాని ఆ నిర్ణయం ఎంత వ్యక్తిగతమైన కారణంవల్ల తీసుకోవడం జరిగినా (ఉదాహరణకి, పోలీసు యూనిఫారం చూసి ముచ్చటపడ్డా) దాని అసలుస్వభావం బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి ప్రాతినిధ్యం వహించడమా లేక ప్రజల పక్షానవుండడమా అన్నదే. అందులో మొదటిది చేస్తే దెబ్బతినడమూ తథ్యమే. కాబట్టి చారిత్రిక క్రమాన్ని అర్థంచేసుకొని ఆ అవగాహన ఆధారంగా తన ఆశయాలను సాధించుకోవడం సరయిన స్వేచ్ఛ. అందుకే 'ఆవశ్యకతను అంగీకరించడం స్వేచ్ఛ' అని ఎంగెల్స్ అన్నాడు. ఆకాశంలో విహరించదలచుకున్న వాడు విమానం ఎక్కాలన్న "నిర్బంధం" లేదు. అయిదంతస్తుల మేడ ఎక్కి అమాంతం గాలిలోనికెగరవచ్చు. అయితే భౌతికవాస్తవాన్ని నిరసించే ఈ చర్యను మతిలేనివాళ్ళ తప్ప 'స్వేచ్ఛ' అనరు. సమాజ పరిణామంలో వ్యక్తుల కార్యాచరణకు గూడ ప్రాముఖ్యత యెక్కువేవుంది. వారి కార్యాచరణ వల్లనే సమాజం మారుతుంది. అయితే ఆ ఆచరణ సాఫల్యం పొందాలంటే అది సమాజం యొక్క గతిసూత్రాల ననుసరించి వుండాలి. లేకపోతే వూహించిందొకటయితే జరిగేది మరొకటి.

ఇదంతా మార్క్సిస్టులు కాదంటున్నారా? 'మనిషి పరిస్థితులకు బానిస' అంటున్నారా? చివరికి కమ్యూనిస్టు మానిఫెస్టోలో చెప్పినట్లు బూర్జువావర్గంనుండి

కొంతమంది, ముఖ్యంగా మేధావులు, శ్రామికవర్గంవైపు వస్తారన్నదిగూడ కాదంటున్నారా ? ఎవరినిగురించి సురేంద్రరాజు మాట్లాడుతున్నది ? ఎవరీ 'శాంతచిత్తులై' 'భద్రంగా ఎటువంటి తపనకు గురికాకుండ' కడుపులో చల్లకదలకుండ జీవిస్తున్న మార్క్సిస్టు రచయితలు ? వుద్యోగాలు పోగొట్టుకున్నవాళ్ళా, ఎమర్జన్సీ రోజులు జైళ్లలో గడిపినవాళ్ళా ? 'వాస్తవం మారినప్పుడే చైతన్యం మారుతుంద'ని యాంత్రికంగా నమ్మినవాళ్లయితే రచయితలసంఘాలు. సాంస్కృతిక సంస్థలు, పార్టీలు పెట్టుకోవడం ఎందుకు ! ఇంతకీ 'తపన' అంటే సురేంద్రరాజు వుద్దేశ్యంలో యిదంతాకాదు. మార్క్సిస్టు రచయితలు పోలీసులాఠీలు- సుబ్బారావు పాణిగ్రాహి, సరోజ్‌దత్తాలలాగ పోలీసు గోలీలు ఎదుర్కొన్నారన్నది అతనికనవసరం. వాళ్ల ప్రపంచాన్ని చూసి 'ఆందోళనతో, కసితో, కాల్చివేసేతపనతో, దుఃఖంతో, నిరాశతో' దేవదాసుఫక్కీలో మనోవేదన పొందడం లేదన్నది అతనిఆరోపణ.

ఇక, కళకూ భౌతికఉత్పత్తి (విధానాని)కీ గల "అసమానత" ఉపరితలంలో ఒక భాగమయిన కళలు, మొత్తం ఉపరితలంలాగే పునాది మారినంత సులభంగామారవు. అంటే కొంచెం వెనకబడివుండే అవకాశంవుంది. మరొకసందర్భంలో మార్క్స "గతం మనుష్యుల మనస్సునొక పీడకలలాగ ఆవరించి వుంటుంద"న్నాడు. 5 అంతే గాని ఉపరితలఅంశాలు "ఆనాటిసామాజిక పరిస్థితులను అధిగమించి వుంటాయ"నడం ఆశ్చర్యకరం. పైగా దీనికిచ్చిన వుదాహరణ : "జర్మనీలో పెట్టుబడిదారీ విధానం ప్రవేశించకముందే పెట్టుబడిదారి సమాజంకన్న ఉన్నతమయిన సామ్యవాద సమాజాన్ని గూర్చిన సిద్ధాంతాలు తత్వశాస్త్రంలో ప్రవేశించడం (మార్క్స)" ఇదిమరీ ఆశ్చర్యకరం. మార్క్స జీవితకాలంలో పెట్టుబడిదారీ విధానం జర్మనీలో లేదా ? ఒకవేళ లేదనుకున్నా మార్క్స జర్మన్ దేశస్తుడయిన పాపానికి ఆ సమాజవాస్తవానికే స్పందించాలా ? పెట్టుబడిదారి సమాజం పుట్టుకనుండి అంతర్జాతీయ స్వభావం కలిగివుంది. ఆనాటికి ఇంగ్లండ్‌లో పెట్టుబడిదారీ విధానం సంపూర్ణంగా విస్తరించివుంది. జర్మనీలోగూడ బూర్జువావర్గం అప్పటికి రాజ్యాధికారాన్ని సంపూర్ణంగా చేజిక్కించుకోలేదుగాని, బూర్జువా ఆర్థిక సంబంధాలు బాగావిస్తరించాయి. ఈ తప్పుడు ఉదాహరణ ఆధారంగా తప్పుడుసూత్రీకరణచేసి సురేంద్రరాజు సాధించింది ఏమిటంటే : "తప్పనిసరిగ సామాజిక సంబంధాల నధిగమించే ప్రయత్నంచేస్తుంది సాహిత్యం." మరొకచోట "ఆచరణ తత్వశాస్త్రంలో ఆలోచనలు, కల్పనాశక్తి ప్రాథమికం", "తాత్వికుడు, కవి ముందుగా కల్పిస్తేనే తర్వాత సమాజంలో ఆకృతి తీసుకోవడం జరుగుతుంది." సమాజ పరిణామంలో వ్యక్తిగత అంశాన్నీ, పునాది ఉపరితలాల అసమాన అభివృద్ధిని,

సురేంద్రరాజు అర్థంచేసుకున్నది ఈవిధంగా. దీనిని భౌతికవాదం అంటారా? దీని కంతటికీ ఆధారంగా చెప్పిన మార్క్స్ మాటలు: "భౌతికవాద సిద్ధాంతం (ఇక్కడ మార్క్స్ అధిభౌతికవాదం గురించి మాట్లాడుతున్నాడు) మారేపరిస్థితుల గురించి విద్యనుగురించి వివరించేటప్పుడు పరిస్థితుల్ని మార్చేది మనుష్యులేనని.... మర్చిపోయింది." తరువాత "శిల్పకారుడు.... తానునిర్మించబోయే కట్టడాన్ని ముందుగానే తనకల్పనలో చిత్రిస్తాడు. శ్రమచివర శ్రామికుడు తాను ముందుగా వూహించినదానినే పొందుతాడు". ఈ మాటలుచెప్పి "ప్రపంచాన్ని, బాహ్యవాస్తవికతని (విషయాన్ని) మార్చేవ్యక్తి ఈవిధంగా ముందుగానే తాను మార్చబోతున్న వాస్తవికతను గురించిన జ్ఞానాన్ని కలిగివుంటాడు" అంటే ఎవరికీ అభ్యంతరంలేదు. కాని ఆ వూహ, ఆ జ్ఞానం అతనికెక్కడినుంచి వచ్చింది? 'సామాజిక సంబంధాలను అధిగమించడం' వల్లనా? ఇది భావవాదంకాదూ?

భవిష్యత్తు వర్తమానంలోని వైరుధ్యాలనుండి పుడుతుంది. అంటే వర్తమానంలోని ప్రధాన వైరుధ్యంలో ఒకఅంశం (ఒకధ్రువం) భవిష్యద్వాస్తవానికి బీజంగా వుంటుంది. ఈ అంకురరూపంలోని భవిష్యద్వాస్తవానికి ప్రతిబింబంగా దాన్ని గురించిన 'వూహ' గూడ వర్తమానంలోనే వుంటుంది. పెట్టుబడిదారీ సమాజంలో స్వంతఆస్తికీ సామాజికమయిన వుత్పత్తికీగల వైరుధ్యంలో రెండవఅంశం, అంటే వర్గపరంగా చెప్పాలంటే కార్మికవర్గం, సామ్యవాదానికి బీజంగావుంటుంది. దాని ప్రతిబింబంగానే సామ్యవాదాన్ని గురించిన 'వూహ'. "సామ్యవాదం ఒక శక్తికావాలంటే అది కార్మికవర్గ రాజకీయోద్యమంయొక్క ఆశయంకావాల"ని లెనిన్‌చెప్పాడు.[6] అంతేకాని సామాజిక సంబంధాల నధిగమించే సాహిత్యకారులు, తాత్వికులు చేసే ఊహ కాదు సామ్యవాదం.

ఇది అర్థంకాకపోబట్టే "వాస్తవం మారితేనేగాని చైతన్యం మారదు" అన్న త్రిపురనేని మాటకు "ఆ వాస్తవాన్ని మార్చదానికి అవసరమయిన చైతన్యమయినా కావాలి గదా!" అని చాల తెలివిగా సమాధానం చెప్పారు రేపటి వాస్తవం అంకుర రూపంలో ఈనాటి వాస్తవం గర్భంలోవుంటుంది కాబట్టి దానికనుగుణమయిన చైతన్యం గూడ ఆ మేరకువుంటుంది. అయితే ఆ చైతన్యం సంపూర్ణంగా వికసించాలంటే బీజరూపంలోని రేపటి వాస్తవానికి సంపూర్ణమయిన అస్తిత్వం చేకూరాలి.

## సురేంద్రరాజు ప్రపంచం

సురేంద్రరాజుకున్న తక్కిన అపోహలకు సమాధానం చెప్పాలంటే మొదట అతని ప్రాపంచిక దృక్పథం ఎటువంటిదో చూడాలి. అసలీప్రపంచం చాల వింత

యినది. ఇందులో పాలకవర్గాలుంటాయిగాని శ్రామికవర్గం వుండదు. మార్క్సిజం ప్రకారం దోపిడీవర్గం పాలకవర్గంగా వుంటుందిగాని, సురేంద్రరాజు ప్రపంచంలోని పాలకవర్గం దోపిడీచేసేట్టు కనబడదు. అది సాంస్కృతికంగా మాత్రం ప్రజల్ని నిర్వీర్యం చేస్తుంది. ఈ పీడనకు గురయ్యేది శ్రామికుడుకాదు, వూరూ పేరూలేని 'వ్యక్తి.' దానినెదుర్కొనేది గూడ ఒక వర్గంకాదు, విశిష్టులయిన వ్యక్తులు. వీళ్ల "సాహిత్యాధ్యయనం చేసినవాళ్లు, లేదా తాత్వికరచనల్ని చదివినవాళ్లు. సరయిన రాజకీయఅవగాహనగలవాళ్లు." వీళ్ల ప్రజల్ని వెలుగులోనికి రప్పించడానికి "ఉత్తమ సాహిత్యాన్ని కళల్ని సృజిస్తారు." వీళ్ల సృష్టించే 'నిజమయిన సాహిత్యం' సదరు 'వ్యక్తి'ని "చైతన్యవంతమయిన కార్యాచరణకు ప్రోత్సహించి, వ్యవస్థకు వ్యతిరేకంగా మారుస్తుంది".

ఈ ప్రపంచంలోని పాలకవర్గాలు, వారి భావాలు యెటువంటివి? "ఆనాడు ప్రచారంలోవున్న పాలకవర్గభావాలు మనిషిని అంధుడిగా, వెధవగా, సామాన్యుడిగా మారుస్తాయి." ఇది యే వాస్తవ ప్రపంచంలో జరుగుతుంది? పాలకవర్గాలకేం కావాలి? దోపిడీ నిరంతరాయంగా సాగడం. పాలకవర్గభావాలు దానికి అనుగుణంగా పని చేస్తాయి. ఇది తప్పనిసరిగ మనుష్యుల్ని 'అంధులుగా వెధవలుగా సామాన్యులుగా' మార్చడంవల్ల సమకూరుతుందా? పూర్తిగా పతనమయిన భూస్వామ్య వ్యవస్థలో అది నిజంకావచ్చు– ఆ వ్యవస్థ 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' నన్నట్లు పడివుంటుంది కాబట్టి. కాని పెట్టుబడిదారీ వ్యవస్థ, ఎంత పతనమయినప్పటికీ, నిరంతరం పెట్టుబడిని విస్తరించుకుంటూ,[7] వైరుధ్యాల పరిమితిలో ఉత్పత్తిశక్తుల్ని విప్లవీకరించుకుంటూ[8] పోతుంది. అటువంటి వ్యవస్థకు కావలసింది అంధులూ వెధవలూ సామాన్యులూ కాదు. ఒక 'విశిష్టమయిన' దృక్పథంగలవాళ్లు, చాలతెలివయినవాళ్లు, సమర్థవంతులూ కావాలి. వైజ్ఞానిక పరిశోధనా కేంద్రాలు, వాణిజ్యసంస్థలూ కావాలి. ఆధునిక యంత్రాంగంతో పనిచేసే నైపుణ్యంగల కార్మికులు కావాలి. ఆధునిక పరిశోధనాసాధనాల సాయంతో తిరుగుబాటును అణచే సామర్థ్యంగల పోలీసు ఉద్యోగులు కావాలి, దీనిని తెలివిగా సమర్థించే రచయితలు, మేధావులు కావాలి. 'అంధులూ వెధవలూ సామాన్యులూ' ఈ పనులన్నీ చేయలేరు.

మరి ఈ పాలకవర్గ భావాలను ప్రచారంచేసేది యెవరు? "ఏయుగంలోనయినా ఆనాటి పాలకవర్గాల భావాలే ప్రబలంగా వుంటాయి" అన్న మార్క్స్ సూత్రాన్ని వ్యాఖ్యానిస్తూ సురేంద్రరాజు "ఏ ప్రభుత్వమయినా మేధావుల్ని పోషిస్తుంది గనుక

అనాటి పాలకవర్గాల తొత్తులగావుండే రచయితలు, కవులు పాలకవర్గాల భావాలనే సరియైన భావాలగా ప్రచారంచేస్తారు" అంటున్నారు. మన దేశంలో పాలకవర్గ భావాలను ప్రచారంచేసే కవులు, రచయితలు ప్రభుత్వంచేత పోషించబడేవాళ్ళా? అది నిజమయినంత మేరకు వారాపని చేయడానికి అదేనా కారణం? ఇతరులను యాంత్రిక భౌతికవాదులనే సురేంద్రరాజుకిది క్షుద్ర భౌతికవాదంగా కనిపించలేదా? ఒక పాలక వర్గానికి దాని రాజకీయ సాంస్కృతిక ప్రతినిధులకువున్న సంబంధం అంతనీచమయినదా? అయినదానికి కానిదానికి మార్క్స్‌చేత మాట్లాడించడం మామూలయిపోయింది కాబట్టి నేనూ అపనే చేస్తాను. 'లూయీ బోనపార్టే' వ్యాసంలో ఈ విషయం గురించి మార్క్స్ ఈ విధంగా అన్నాడు[9]. ఒక వర్గం తన భౌతిక అవసరాలదృష్ట్యా, సామాజికస్థానందృష్ట్యా ఏ పరిమితులకయితే లోబడివుంటుందో, ఏ సమస్యలనెదుర్కొంటుందో, ఏ పరిష్కారాల నాశ్రయిస్తుందో, తన ఆలోచనలో ఆ పరిమితులకు, ఆ సమస్యలకు ఆ పరిష్కారాలకు లోబడేవాడు ఆ వర్గం యొక్క రాజకీయ, సాంస్కృతిక, ప్రతినిధి.

అంతేకాని, ప్రభుత్వోద్యోగులు కావడంచేత పాలకవర్గాల తొత్తులు కాలేదు.

పాలకవర్గాలు, వారిప్రతినిధులు ఇలాగుంటే, ప్రజలమాటేమిటి? ఈప్రజలు (కొందరు విశిష్టవ్యక్తుల్ని మినహాయించి) 'అంధులు వెధవలు సామాన్యులు' అని ఇదివరకే చూసాం. అంతేకాదు వీళ్ళలో "అధికజనాభా అజ్ఞానంలో చీకటిలో సంఘాన్ని సాంప్రదాయాల్ని ప్రశ్నించనయినా ప్రశ్నించకుండ తమజీవితాల్ని గడుపుతుంటారు". ఇంకా "మనిషి కృత్రిమవిలువల్ని పాటించేవాడుగా, పరాధీనుడుగా, ఒక శకలంగా, ఏకాకిగా, అసాహిత్యాన్ని నీచసంస్కృతిని ఆనందించేవాడుగా" మారతాడు. "పాలక వర్గాల భావాలు సాంస్కృతికరూపాల్లో ప్రచారం చేయబడతాయి గనక విచక్షణ, వివేచనలేని సామాన్యులు అర్థరహితంగా సారహీనమయిన జీవితాల్ని గడుపుతుంటారు". వీరికి నిరుద్యోగసమస్య, వేశ్యావృత్తి సమాజంలో వున్నట్లు తెలుసు. కాని వాటికి వ్యతిరేకంగా పోరాడ్డం అలావుంచి వాటిని వినియోగించుకుంటారు. ఉద్యోగంకోసం లంచమిస్తారు, తమకామాన్ని చల్లార్చుకోవడంకోసం వేశ్యల్ని ఆశ్రయిస్తారు (శివ శివా!)

సురేంద్రరాజుకు 1974లో దేశపాలక వర్గాలను హడలెత్తించిన రైల్వే కార్మికుడు 'ఏకాకిగా, శకలంగా, పరాధీనుడిగా' కనబడ్డాడా? పల్లెపల్లెలో తరతరాల నుండి వస్తున్న వెట్టిచాకిరీవంటి దోపిడీ రూపాలను ఎదిరిస్తున్న ప్రజలు 'అజ్ఞానంలో చీకటిలో సంఘాన్ని సాంప్రదాయాల్ని ప్రశ్నించనయినా ప్రశ్నించని' వాళ్ళగా కనబడుతున్నారా? ఈ రకమయిన నిస్తేజం లిగించడానికి పాలకవర్గం కప్రయత్నిస్తుందనడం

ఒకయెత్తు. కాని దానికి సహజంగానేవుండే ప్రతిఘటనను, శ్రామికవర్గ సంస్కృతిని- అది ఎంత అస్పష్టంగా వుండనీ- విస్మరించడంమాత్రం క్షమార్హంకాదు. ఇంతకీ ఈ పెట్టుబడిదారీ వ్యతిరేకత శ్రామికవర్గంపట్లవున్న ఏహ్యభావానికి ముసుగు మాత్రమే. ఈరోజు శ్రామికవర్గాన్ని బాహాటంగా అసహ్యించుకోవడం వీలుపడదుగనక, వ్యవస్థ మీదపెట్టి అపనిచేయడానికే ఇదంతా.

ప్రజలిలా ఏడిస్తే మరి ఈ విశిష్టవ్యక్తులెలాంటివాళ్లు ? వీళ్లకొక వర్గం లేదు. వీళ్లు భౌతిక వైరుధ్యాలకు స్పందించి పాలకవర్గాలనెదిరించే వాళ్లుకారు. అసలు సురేంద్ర రాజు వుద్దేశ్యంలో ఒక వ్యక్తి విప్లవకారుడు కావాలనుకోవడం సమాజంపట్ల, తోటి మానవునిపట్ల అతనికున్న నైతికబాధ్యతను మాత్రమే సూచిస్తుంది. ఇది మార్క్సిజానికి పూర్తిగా విరుద్ధం. విప్లవభావాలు భౌతిక వైరుధ్యాలనుండి పుడతాయి. విప్లవ వర్గం పాలకవర్గంతో మౌలికమయిన వైరుధ్యంగలవర్గం. ఇక్కడ నైతిక బాధ్యత ప్రసక్తి అనవసరం. తాను దున్నుతున్న భూమిలోని పంట తనకే దక్కాలన్న కోర్కెలో 'నైతికబాధ్యత' లేదు. అది కేవలం 'స్వార్థమే'.

దీనికి భిన్నంగా ఈ విశిష్టవ్యక్తులు "పాలకవర్గాల భావాల నాశ్రయించకుండ జీవితాన్ని గడపగలిగేవాళ్లు." ఉద్యోగం కోసం లంచం యివ్వడంవంటి "సంఘం ఆమోదించేపనుల్ని విరోధించి" జీవించేవాళ్లు (వీళ్లకి పదెకరాల మాగాణి వుంటుంది కాబోలు) ఈ రకంగా పాలకవర్గ భావజాలం నుండి విముక్తిపొందడానికి వారికి సాహిత్యం తోడ్పడుతుంది. ఇది ఇదివరకు చెప్పిన 'నిజమయిన' సాహిత్యం. చరిత్రలో వ్యక్తిగత అంశానికి గల ప్రాముఖ్యత, సాహిత్యానికి ఉత్పత్తికీ గల అసమానత మార్క్సిజాన్ని దాటి ఎంతదూరం వచ్చాయో గమనించాలి. ఉదాహరణకి : "సంఘాన్ని వ్యతిరేకించాలా లేదా అన్నది వ్యక్తినిష్ఠం. ఆ వ్యక్తి సాహిత్యపఠనం వల్లో, సరయిన సాంఘిక అవగాహనవల్లనో నిజానిజాల్ని తెల్సుకొని బాధ్యతాయుతుడు కావల్సిందే తప్ప వేరుమార్గం లేదు". వ్యతిరేకించేది 'సంఘాన్నా'? ఈ తిరుగుబాటుదార్లు బౌద్ధభిక్షువులా ? తన జీవితనిత్యసత్యమయిన దోపిడిని అర్థంచేసుకోవడానికి ఒక కార్మికుడికయినా రైతుకయినా సాహిత్యపఠనం, సంపూర్ణ సామాజిక అవగాహన, తోడ్పడతాయిగాని అవి అత్యవసరం కాదు. ఇంతకీ శ్రామిక జనం పనికిరానివాళ్లని విప్లవం విశిష్టవ్యక్తులు విశిష్టంగా సాధించేదనీ చెప్పడానికే యిదంతా.

పోనీ యిదంతా నిజమేననుకున్నా ఈ సాహిత్యకారులు ప్రజల్ని మేల్కొలపడానికి ప్రయత్నంచేయాలా ? తన వ్యాసం మొదట్లో ఒకచోట సురేంద్రరాజు అవునసే

అంటాడు. కాని ఉత్తరోత్తరా అసలు విషయం బయటపడుతుంది. "ఉత్తమ సాహిత్యాన్ని, కళల్ని ఆనందించగలశక్తి వారికి (అంటే సామాన్య ప్రజలకు) వుండదు. అయితే ఎంతటి ప్రతికూల పరిస్థితులలోనయినా ఎవరో కొందరు పాఠకు లుంటారు కనుక వారికోసం నిజమయిన సాహిత్యం ఉత్పత్తి అవుతుంది." దీన్ని సమర్థించుకోవడానికి మార్క్సును ఉపయోగించుకున్న విధం చాల ఆశ్చర్యకరం. మార్క్సు, ఉత్పత్తిచేయబడ్డ వస్తువును ఏవిధంగా వుపయోగించాలన్నది ఉత్పత్తే నిర్ణయిస్తుందని, కళకు సాహిత్యానికి సంబంధించిన వుత్పత్తి ఆనందించగల పాఠకుల్ని సృష్టించుకుంటుందని అన్నాడని చెప్పి, దాని నుండి "దీన్నిబట్టి ఏంతెలుస్తుందంటే రచయిత తన రచనను ఉత్పత్తి చేస్తేతప్ప రచనను అర్థంచేసుకోగల, ఆనందించగల పాఠకులు సిద్ధంకారా"ని నిర్ధారణచేసారు. ఆపైన 'అధునిక క్లిష్ట రచనలను', 'అస్పష్టప్రయోగాలను', నిరసించి 'ప్రజల స్థాయినిబట్టి కవిత్వం రాయమనే' అభ్యుదయ రచయితల మీద విప్లవ రచయితల మీద 'ఎంత మోసం!' అంటూ విరుచుకు పడ్డారు అసలింతకీ అక్కడ మార్క్సు ఏమన్నాడు.

--- "An object of art creates a public that has artistic taste and is able to enjoy beauty". అంటే మార్క్సు ఇక్కడ కేవలం సౌందర్య సృష్టిని ధ్యేయంగాగల కళనుగురించి, అంటే పాశ్చాత్యదేశాల్లో అప్పటికి రెండుమూడు శతాబ్దాలుగా సాంప్రదాయంగా వస్తున్న కళనుగురించి మాట్లాడుతున్నాడు. కళా సౌందర్యం సృష్టికోసమేనని మార్క్సు ఎన్నడూ అనలేదుకాబట్టి ఈ మాటనొక సాధారణ సూత్రీకరణగా వుపయోగించడం తప్పు. అయినా, మొదటి శ్రామికవర్గ విప్లవమయిన ప్యారిస్ కమ్యూన్ కూడ జరుగకముందు మార్క్సు అన్నమాటల్ని వేద వాక్కుగా పరిగణించి ఈ విప్లవ యుగానికిగూడ అన్వయించడం ఎందుకు? లేనిచోట యాంత్రికం కనిపించే సురేంద్రరాజుకిది యాంత్రికమనిపించలేదా? అదేవిధంగా, జంతువు తన తక్షణ అవసరాలననుసరించి ఉత్పత్తిచేస్తుందని మనిషి తక్షణఅవసరం లేనప్పుడుకూడ వుత్పత్తి చేస్తాడని, నిజానికి భౌతిక అవసరాల ఒత్తిడిలేనప్పుడే వుత్పత్తి చేస్తాడని మార్క్సుచెబితే దాన్ని ఆధారంచేసుకొని "దీన్నిబట్టి భౌతికావసరాలకు అతీతంగా దృష్టి నిలుపగలిగినవాడు మాత్రమే సాహిత్యాన్ని సృష్టించగలడు. భౌతికావసరాల పరిధిలో జీవించేమనిషి కళల్ని అందుకే ఆనందించలేడు" అనడం వక్రీకరణ అనాలో, వంచన అనాలో తెలియడంలేదు. జంతువులు ఆకలి వేసినప్పుడు తిండివెతుక్కుంటాయి. పక్షులు అవసరం అయినప్పుడు గూళ్లు కట్టుకుంటాయి. మనిషి రేపటి అవసరాన్నిదృష్టిలోవుంచుకొని ఈరోజే వుత్పత్తి చేసుకుంటాడు. ఆవిధంగా

చేయగలడు కాబట్టి, తన భౌతికావసరాలు తీర్చుకునేవేళను వుత్పత్తిచేసేవేళను వేరుగా పెంచుకుంటాడు. దానివల్ల ఉత్పత్తి మరింత సవ్యంగా చేయగలుగుతాడు. ఇదిమార్క్స్ అన్నది. అంతేకాని సాహిత్యకారులు పాఠకులు జితేంద్రియులు కావాలనికాదు. ఆ కారణంచేత సామాన్యులు వెధవలు సంస్కారహీనులు అయిన శ్రామికజనం సాహిత్యానికి అర్హులుకారని ఏమాత్రంకాదు.

ఇకపోతే, ప్రజలకోసం కవిత్వం రాయమంటే ప్రజలస్థాయినిబట్టి రాయడం కాదు. ఈస్థాయి అచలంగా ఎక్కడో వుండేదికాదు. ప్రజాసాహిత్యం, ప్రజాపోరాటం, ప్రజల చైతన్యస్థాయి, పరస్పరం ప్రభావితం చేసుకుంటు అన్యోన్యక్రియ ద్వారా ముందుకుపోతాయి, అంతేకాని, ఈ అన్యోన్యక్రియను 'ఉత్తమ సాహిత్యాన్ని ఆనందించగల' పాఠకుడికి, వాడికోసం రాసే రచయితకు మాత్రమే పరిమితంచేసి, రచయిత ఈ విశిష్టుడయిన పాఠకుడిని ప్రభావితం జేసి, తిరిగి ఆ పాఠకుడి 'మాతృభావాలతో, గ్రహణశక్తితో' ప్రభావితుడై, ఇద్దరూ చెట్టపట్టాలేసుకొని సాహిత్యాకాశంలో విహరించడంకాదు మార్క్సిస్టు దృక్పథంఅంటే. ప్రజాసాహిత్యానికి ప్రజాపోరాటానికిగల అన్యోన్యక్రియ ఈనాడు సూత్రస్థాయి నుండి వాస్తవస్థాయిని చేరుకుంది. బూతుపత్రికలను, సినిమాపత్రికలను, మీ (మా) పత్రికలను చదవని శ్రామికజనం ఈరోజు విప్లవరచయితల కవితలు చదువుతున్నారు, పాటలు పాడుతుంటున్నారు, తామే రాస్తున్నారు కూడ.

వాస్తవం ఇలాగుంటే సురేంద్రరాజు దృష్టిలో ఇవ్వాళ మార్క్సిస్టురచయిత తోటిమానవుడికోసం కాకుండా తన ప్రాపంచిక దృక్పథానికి మాత్రమే నిబద్ధుడవు తున్నాడట. అదేనిజమయితే విప్లవకవిత్వం అదనపు విలువగురించి పెట్టుబడిగురించి రాస్తూవుండాలి. మహాఅయితే మార్క్స్‌గురించి లెనిన్‌గురించి వుండాలి. కాని భాగల్పూర్ గురించి, సిరిసిల్ల జగిత్యాలలగురించి ఎందుకు రాస్తున్నారు? ఈఆరోపణ సురేంద్రరాజు వ్యాసం మూడవభాగంలోవుంది. ఆసంచిక (డిసెంబరు 1980) అట్ట మీదే 'కనువిప్పు'అనే కవితవుంది. 'వాస్తవాన్ని నగ్నంగా, ఏ అచ్ఛాదనలేకుండ స్వీకరించే స్థైర్యం' వున్నది. విప్లవకవులకో లేక ఆవాస్తవం తనలోసృష్టించే 'ఆందోళనను, కసిని, కాల్చివేసే తపనను, దుఃఖాన్ని, నిరాశనూ' ఆనందంతో స్వీకరించే సున్నితుడయిన వ్యక్తికో? అయినా, ఆందోళన, కసి, దుఃఖం వగైరా భావాలను కలిగించే వాస్తవాన్ని కోపంతో స్వీకరించాలిగాని, ఆనందంతో స్వీకరించడంఏమిటి? అదేమిటో ఎందుకో మార్క్స్ చాలకాలంక్రిందే చెప్పాడు. ఒక మిత్రుడికి రాసిన వుత్తరంలో "ఈ రకమయిన పెటీబూర్జువాలు వైరుధ్యాలను ఆరాధిస్తారు. ఎందుచేత

# 'షహీద్' భగత్‌సింగ్ - ఉద్యమమూ - అవగాహనా

## 50 వ వర్ధంతి సంస్మరణ - రెండు పుస్తకాలు పరిశీలన

- ముడార్ వేణు

## 1. భారతదేశ సాయుధ విప్లవ పోరాటచరిత్ర సింహావలోకనం

- యశ్‌పాల్

గాంధీజీ అహింసాతత్వం కేవలం బూటకమని, అతని నాయకత్వంలో కాంగ్రెస్ వారు నిర్వహించే సత్యాగ్రహాలు, సహాయ నిరాకరణలు పిరికి చర్యలని ఎలుగెత్తి చాటి, ఈ దేశం స్వాతంత్ర్యం పొందడానికి సాయుధ పోరాటమొక్కటే మార్గమని మనసానమ్మి, రష్యన్ విప్లవ విజయంతో ప్రభావితులైన భగత్సింగ్, రాజగురు, సుఖదేవ్ మొదలైన యువకిశోరాలు ఆనాటి బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో తీవ్రంగా జరిపిన పోరాటం_ మనకు మన దేశంలో ఏ చరిత్ర చెప్పదు.

ఆనాడు భగత్సింగ్ అసెంబ్లీలో బాంబులుపేల్చి, కరపత్రాలు వెదజల్లి నిద్రలో కూరుకుపోయిన జాతికిపాడిన మేల్కొల్పులు మనకీ దేశచరిత్ర లేవీ వినిపించవు.

సాయుధ పోరాటాన్ని తమ మార్గంగా ఎంచుకొని, సామ్యవాద ఆశయసాధనలో తుదివరకు రాజీలేని పోరాటంచేసి, తమ ప్రాణాల్ని తృణప్రాయంగా తలచి, చిరునవ్వుతో ఉరికంబాల కెక్కిన మహోన్నత విప్లవకారుల్ని మన చరిత్రకారులు, మన నేటి కుహనా రాజకీయ నాయకులు 'టెర్రరిస్టులు'గా (దౌర్జన్య కారులుగా) వక్రీకరిస్తున్నారు.

అప్పటి ఆ సాయుధ విప్లవ పోరాటాల్లో భగత్సింగు సహచరులుగా వుంటూ, విప్లవ సంఘ కార్యక్రమాల్లో పాలుపంచుకొంటూ, చివరికి ఒకానొక బనాయింపు కేసులో జీవిత ఖైదుననుభవించిన హిందీ సాహితీవేత్త యశ్‌పాల్ రచించిన 'సింహావలోకన్' మూడుభాగాల్లో మొదటిభాగాన్ని శ్రీ ఆలూరి భుజంగరావు తెలుగులోకి 'సింహావలోకనం' పేరుతో అనువదించారు.

ఈ పుస్తకంలో ఆనాటి సామాజిక పరిస్థితులు, కాంగ్రెస్‌పార్టీ గాంధీ నాయకత్వంలో అనుసరించిన దళారీ రాజకీయవిధానం, ప్రజల మనోభావాలు, విప్లవ సంఘ

---

నంటే ఆ వర్గం అస్తిత్వానికి మూలమే వైరుధ్యం కాబట్టి" అన్నాడు. 0 అందుచేత సామాజిక వర్గవైరుధ్యాలను, వాటి ఫలితాలను, 'ఏఆచ్ఛాదన లేకుండ', 'ఏసిద్ధాంతము జోడించకుండ', దుఃఖంతోను మళ్లీ ఆనందంతోను, కసితోను మళ్లీ ఆందోళనతోను స్వీకరించడం.

(మిగతా వచ్చే సంచికలో)

# మార్క్సిజం - సాహిత్యం

(గత సంచిక తరువాయి)

అయితే సురేంద్రరాజు ప్రపంచంలోకి మళ్ళీ ప్రవేశించాల్సిన అవసరంవుంది. ఈ ప్రపంచంలో కర్కోటకులయిన పాలకులు, కుసంస్కారులయిన ప్రజలు, జితేంద్రియులయిన కొంతమంది సాహిత్యకారులు వారి పాఠకులు వుంటారనిచూసాం. ఈ సాహిత్యకారులు ఏదోవిధంగా తాము జీవిస్తున్న సమాజానికి వ్యతిరేకంగా పోరాడుతారు, ఎందుకు? వారికీ, సమాజానికి సఖ్యత లేదుకాబట్టి- సఖ్యత ఎందుకు లేదు? కృత్రిమవిలువల్ని పాటించే పెట్టుబడిదారి సమాజంలో జీవిస్తున్నారు గనుక. మరదీనికి- దీనికీగూడ- మార్క్సు మద్దతుకావాలి, థియరీస్ ఆఫ్ సర్ప్లస్ వాల్యూ అన్నపుస్తకంలో మార్క్సు "పెట్టుబడిదారి వ్యవస్థలో భౌతికవుత్పత్తి కొన్నిరకాల మేధాగతమయిన (spiritual) ఉత్పత్తికి ప్రతికూలంగా వుంటుంది- ఉదా: కళలకూ, కవిత్వానికీ" అన్నాడనిచెప్పి దాన్ని సురేంద్రరాజు ఈవిధంగా వ్యాఖ్యానిస్తున్నారు: "పెట్టుబడిదారి వ్యవస్థలో కళలు అభివృద్ధి చెందవని మార్క్సు అంటున్నాడంటే దానిక్కారణం- మనిషి కృత్రిమ విలువల్ని పాటించేవాడుగా, పరాధీనుడుగా, శకలంగా, ఏకాకిగా, అసాహిత్యాన్ని నీచసంస్కృతిని ఆనందించేవాడుగా ...." వగైరా వగైరా తయారవుతాడు కాబట్టి. మార్క్సు చెప్పిందానికిదాఅర్థం? అసలు పెట్టుబడిదారి సమాజంలో కళలు వృద్ధిచెందనే చెందవన్నాడా? ఒకవేళ పైనిచ్చిన కొటేషన్ ఆ అర్థాన్ని స్ఫురింపజేసినా, అది సరికాదని అదేపుస్తకంలో వేరేసందర్భాలలో చెప్పినమాటలు రుజువుచేస్తాయి.

పెట్టుబడిదారి వుత్పత్తి విధానానికి కళలకు వైరుధ్యం వుంటుంది- దీనికి కారణం మనిషి కృత్రిమంగాను నీచంగాను తయారవడంగాదు- పెట్టుబడిదారి వుత్పత్తి వస్తు వినియోగంకోసం కాకుండ మార్పిడికోసం జరుగుతుంది- అంటే ఉత్పత్తి అయినా వస్తు వాడకపు విలువ రూపంలో కాకుండా మారకపు విలువ రూపంలో వుంటుంది- ఉత్పత్తికి ప్రోద్బలం అదనపు విలువద్వారా పెట్టుబడిని ఇతోధికం చేసుకోవడం- అయితే కళాకారుల సృష్టికీ, కవితకు అనివార్యంగా మారకపు విలువ వుండాలనిలేదు- ఉండదనీ చెప్పలేం- ఇక్కడే పెట్టుబడిదారి వుత్పత్తికీ కళకు కవిత్వానికీ వైరుధ్యం వుంది- దీనికి భిన్నంగా భూస్వామ్య సమాజంలో వుత్పత్తి (అధికభాగం) వాడకపు వస్తువుల వుత్పత్తి- అదనపు వుత్పత్తి పెట్టుబడిగా మారిన ఈ సమాజంలో దోపిడి

వర్గాలకు గానాబజానాలతోను ముషాయిరాలతోను కాలంగడపడాన్ని మించిన వ్యాపకం వుండదు- అంటే వారి ప్రమాణాల్ననుసరించి ఉత్తమ మనిపించుకున్న కళ, కవిత్వం ఉత్పత్తి కావడానికి వేరే ఏ ఆటంకమూ వుండదు- అందుకనే ప్రత్యేకించి "పెట్టుబడి దారీ వుత్పత్తి విధానం కళకు ప్రతికూలంగా వుంటుంది" అని చెప్పడం.

ఈ వైరుధ్యం వాస్తవంలో ఏరూపం తీసుకుంటుందన్నది నిర్దిష్టస్థాయిని బట్టి వుంటుంది- ప్రముఖ బూర్జువా మేధావి, ఆనాటి (18వ శతాబ్దపు చివరి భాగం) అభ్యుదయ శక్తినింకా కోల్పోని బూర్జువావర్గం ప్రతినిధి అయిన ఆడంస్మిత్ ఒకచోట మతాధికారులను, లాయర్లను, డాక్టర్లను, రచయితలను, ఆటగాళ్లను, పాటగాళ్లను, బఫూన్లను అందరిని ఒకటిగాచేర్చి, వీరందరు నిరర్థకమయిన అనుత్పాదక శ్రామికులు, నౌకర్లతో సమానమని, వీళ్లు సమాజంమీదపడి బ్రతికేవాళ్లని, నిరసనగా అన్నమాటల్ని వుటంకించి, మార్క్స్ దాని నీవిధంగా వ్యాఖ్యానించాడు11. ఇక్కడ ఇంకా విప్లవ శక్తిని కోల్పోని బూర్జువావర్గం మాట్లాడుతోంది- ఈ వర్గం అప్పటికింకా సమాజాన్ని రాజ్యాంగాన్ని సంపూర్ణంగా తనకు లోబరచుకోలేదు- అయితే ఈ బూర్జువావర్గం పూర్తిగా అధికారంలోకివచ్చి, ఉత్పాదక శ్రమకు ప్రతినిధిగా వున్నదికాస్తా, వుత్పాదక శ్రామికుల్ని తనవంతుగా ఎదుర్కొన్నపుడు, ఇక్కడ నిరసించిన వాళ్లందరిని 'తన వాళ్ల'గా ఎంచుకుంటుంది- క్రమంగా 'సంస్కారం' పెరిగి తింటే చాలదని 'సంస్కారం' వుండాలని గ్రహిస్తుంది- ఈ భౌతికేతర వుత్పత్తులన్నీ పెట్టుబడిదారీ వుత్పత్తిలో భాగమవుతాయి, పెట్టుబడిదార్ల లాభాలకోసం చేయబడతాయి- అప్పుడు తాను వ్యర్థ మని నిరసించిన ఈ ఉత్పత్తులనే ఉపయోగకరమని సమర్థిస్తుంది- (సుదీర్ఘమయిన మార్క్సు వ్యాఖ్యకు ఇది స్వేచ్ఛానువాదం మాత్రమే).

ఇది గతశతాబ్దం మధ్యభాగపు విషయం. తరువాతి పరిణామాల్నిగూడ తెలుసు కోవాలి- క్రమంగా పెట్టుబడిదారీ సమాజం గుత్తపెట్టుబడిదారీ స్వభావాన్ని పొందింది- అంటే అంతవరకు అప్పుడప్పుడు- ఆర్థిక సంక్షోభాల సమయంలో ఎదుర్కొన్న 'మార్కెట్ సమస్య' దైనందిన సమస్యగా మారికూర్చుంది- అధికంగా పెట్టుబడి కేంద్రీకరించ బడటంచేత, దాన్ని లాభదాయకంగా మదుపుపెట్టడానికి కావలసిన మార్కెట్ల విస్తరణ సమస్యయిది (దీనిని ఆర్థిక శాస్త్రవేత్తలు అదనపువిలువ ఫలదీ కరణ సమస్య- Problem of realisation of surplus value. అంటారు). దీనికొక పరిష్కారం, ప్రచారసాధనాలను ముమ్మరంగా వాడుకొని వాడకందారుల [illegible] పోషించుకోవడం- దానికి కళను లొంగదీయడమే కాదు,

కళనే ఒక ప్రచారసాధనంగా వాడుకుంటుంది పెట్టుబడిదారివర్గం- ఈరోజు పాశ్చాత్య దేశాల్లో రేడియో, టి. వి. లలోని ప్రోగ్రాంలు అధికంగా గుత్త పెట్టుబడిదారి సంస్థలు నిర్వహించేవే- వీటిని 'కమర్షియల్స్' అంటారు- అంతేకాదు, కళాభవనాలు (art galleries) నడుపుతారు, వేలడాలర్లు వెచ్చించి తమకే అర్థంగాని అరూప కళా ఖండాలు కొంటారు- ఒకప్పుడు నిరర్థకమని నిరసించిన సైద్ధాంతిక పరిశోధననే కాకుండ నిజంగానే నిరర్థకమయిన నకిలీ పరిశోధననుగూడ ఇప్పుడు ప్రోత్సహిస్తున్నారు- వివిధ 'ఫౌండేషన్ల' ద్వారా[12]. కాబట్టి తన పరిణామక్రమంలో బూర్జువా వుత్పత్తి విధానం 'కళాపోషణ' అవసరంగా చేస్తుందని గ్రహించాలి- (ఈ కళ పాలక వర్గాలకళే గాని ప్రజాకళకాదని వేరేచెప్పనవసరం లేదు. అయితే సురేంద్రరాజు చెప్పే 'ఉత్తమ' కళకు ఈ మార్కెట్ల విస్తరణార్థం జరిగే కళాపోషణకు ఏ విరోధం లేదు- ఈ పోషణ పుణ్యమా అని ఈనాడు అమెరికాలో 'ఆధునిక కళాకారులు' చాలమంది లక్షాధికారులయ్యారు)

పోనీ పెట్టుబడిదారి వుత్పత్తి విధానం 'ఉత్తమ' సాహిత్యానికి కళకు విరోధి అనుకుందాం- మరి మన 'ఉత్తమ' సాహిత్యకారులు కళాకారులు ఏంచేయాలి? ఆ ఉత్పత్తి విధానాన్ని ఎదిరించాలి- అంటే (తాత్వికజ్ఞానం గలవాళ్లు, గతితర్కం ఎరిగిన వాళ్లు కాబట్టి) అందులోని వైరుధ్యాల్ని పురస్కరించుకొని కార్మికవర్గంతో చేయికలపాలి- కాని సురేంద్రరాజు ప్రపంచంలోని మేధావిచేసేది ఈ పని కాదు- ఇతను 'సమాజానికి వ్యతిరేకంగా పోరాడతాడు'- ఉత్పత్తి విధానంతో విరోధం వున్నవాడు మొత్తం సమాజంతో పోరాడడం ఎందుకు? అయితే ఇది కేవలం అతని వ్యక్తిగతమయిన వెర్రికాదు- ఒక కొత్త చారిత్రిక సిద్ధాంతం "వ్యక్తికీ సమాజానికి మధ్య కొనసాగే ఘర్షణ గతితార్కికంగా కొనసాగుతుంది- దాని ఫలితంగానే ఆ సమాజంలో మార్పు వస్తుంది"- మరొకచోట "గతితార్కికత క్రియాశీలంగా చరించాలంటే వ్యక్తికీ వాస్తవానికీ ఘర్షణ జరగడం అనివార్యం."

'చరిత్ర అంతా వర్గపోరాటాల చరిత్ర' అని నమ్మే మార్క్సిజం నుండి ఇంత దూరంపోయి, యాంత్రికతకు గతితార్కికతకు గల భేదం వివరించ బూనుకోవడం ఎందుకు? ఇది చారిత్రిక భౌతికవాదంకాదు, చారిత్రిక అధివాస్తవికవాదం- ఇంత భయానకమయిన వాదానికి గతితర్కం గూడ చేరిస్తే ఏమవుతుందో చెప్పలేం కాబట్టి దయచేసి యాంత్రికంగానే అన్వయించమని ప్రార్థన.

## 'ఆధునిక' సాహిత్యం

ఇరవయ్యవ శతాబ్దంలో పాశ్చాత్య సాహిత్యంలో వచ్చిన సాహిత్యోద్యమాలన్నింటిని మార్క్సిస్టులు బూర్జువా సాహిత్యం, క్షీణసాహిత్యం అని విమర్శించారని,

అయితే ఈ సాహిత్యం బూర్జువా విలువలకు వ్యతిరేకంగా వచ్చిన సాహిత్యమని సురేంద్రరాజు ఆరోపిస్తున్నారు. దీన్ని కొంచెం వివరంగా పరిశీలించాల్సివుంది.

ప్రథమంగా వర్గసాహిత్యం గురించి మార్క్స్ చెప్పిన మాటల్ని మరోసారి గుర్తుచేయాలి. ఒక వర్గం తన సామాజిక ఆర్థిక అవసరాలదృష్ట్యా అవలంబించే దృక్పథాన్ని తన వ్యక్తిగతమయిన కారణాలవలన అవలంబించేవాడు ఆ వర్గానికి ప్రతినిధి. (అయితే దీన్ని ఫార్ములాగా మార్చి మామొహాన కొట్టొద్దని సురేంద్రరాజు వంటి వారికి విజ్ఞప్తి) ఈ **అవగాహనతో** పాశ్చాత్య సాహిత్యాన్ని పరిశీలించేటప్పుడు గతశతాబ్దానికి ఈ శతాబ్దానికి పెట్టుబడిదారి విధానంలోని తేడాలు గమనించాలి.

గతశతాబ్దం చివరి భాగందాకా పెట్టుబడిదారి ఆర్థిక విధానం (మొత్తం మీద) పెట్టుబడుల పోటీని ప్రాతిపదికగా కలిగివుండింది. పారిశ్రామిక విప్లవాన్ని సాధించి ఆవిరిశక్తిని ప్రప్రథమంగా వుత్పత్తికి చోదకశక్తిగా మార్చింది. భౌతిక ప్రపంచం గురించి జ్ఞానం పెరిగేకొద్దీ దాన్ని వుత్పత్తికి వాడుకొని ఉత్పాదకతను విపరీతంగా పెంచింది. అటువంటి వ్యవస్థలోని పాలకవర్గానికి సహజంగానే శాస్త్రీయ దృక్పథం, హేతువాదం, ప్రగతివాదం, యథార్థవాదం వచ్చుతాయి. దీని ప్రతిబింబమే అనాటి బూర్జువా తాత్విక సిద్ధాంతాలలో ఈ వాదాల ప్రాబల్యం. అంతేకాకుండా, విభిన్న దేశాల పెట్టుబడిదారి వర్గాల మధ్య వైరుధ్యాలున్నా గెల్చుకోవడానికి ప్రపంచమంతా వుంది కాబట్టి ఆ వైరుధ్యాలు తీవ్రంగా పరిణమించలేదు. విశాలమయిన ఆసియా ఆఫ్రికా ఖండాలలోని మార్కెట్లు 'తమ'వే కావడంతో వారికి ఈ ప్రపంచం చాల అందంగా కనిపించింది. అందుకే బెన్ జాన్సన్ అన్నాడు,

"ALL IS WELL WITH THE WORLD
...GOD IS IN HIS HEAVEN."

గతశతాబ్దం చివరిభాగానికి పెట్టుబడి కేంద్రీకరణజరిగి గుత్తపెట్టుబడిదారి వ్యవస్థ వుత్పన్నమయింది. దీనితో వనరులకోసం వలసలవేట విజృంభించింది. అంత వరకూ రెండుమూడు దశాబ్దాలకొకసారి వచ్చే ఆర్థికసంక్షోభం, క్రమంగా రోజువారీ సమస్యగామారి మార్కెట్లకోసం పోటీమరీ అధికమయింది. కాని ఆసియా ఆఫ్రికా ఖండాలు ఎంతపెద్దదయినా ఒక పరిమితి వున్నవి కాబట్టి ఈపోటీకి పరిష్కారం ఇదివరకటంత సులభం కాకుండ పోయింది. మొదటి ప్రపంచయుద్ధం జరిగింది. ఇదంతా చాలదన్నట్లు కార్మికవర్గానికి 'లేనిపోనిఆశలు' కల్పిస్తూ అక్టోబర్ విప్లవం జరిగింది. హఠాత్తుగా అందమయిన వాస్తవం వికారంగా తయారయింది. తాత్విక స్థాయిలో యిది అధివాస్తవిక వాదంగా పరిణమించింది. అంతవరకు తమ ఆధిపత్యం

అనంతంగా విస్తరిస్తుందనుకున్న బూర్జువా వర్గాలకు అది నిజంకాదని, తమలోతాము కీచులాడుకోవడమే జరిగేదని తెలిసేసరికి ప్రగతిమీద నమ్మకంపోయింది. అందుకే ఈ 'ఆధునికుల'లో మొదటి వాడయిన టి.ఎస్. ఎలియట్ ప్రగతివాదం మీదనేయుద్ధం ప్రకటించాడు.[13] ఉత్తరోత్తరా వలసలలో తిరుగుబాట్లే కాకుండ, ఉత్పత్తి శక్తుల నిరంతర విప్లవీకరణగూడ పెట్టుబడిదారీ ఆస్తిసంబంధాలతో ఢీకొని కొత్త కొత్త సమస్యలని తెచ్చిపెట్టింది. రసాయనిక పదార్థాలనుత్పత్తి చేస్తే నదుల్లో చేపలు చస్తున్నాయి. కలప పరిశ్రమ విస్తరిస్తే వరదలు వస్తున్నాయి. అణుశక్తి ప్రయోజనాన్ని కనుగొంటె హిరోషిమా నాగసాకిలలో లెక్కలేనంత మంది ప్రాణాలుకోల్పోయారు. ఈ వర్గానికిక శాస్త్రీయదృక్పథం మీద హేతువాదం మీద నమ్మకం సన్నగిలింది. అస్తిత్వవాదం పుట్టింది. ఫ్రెంచివిప్లవ కాలంలో, ఒకనాడు మనిషి ప్రవర్తనగూడ సూత్రబద్ధమని నిరూపించవచ్చునని నమ్మిన బూర్జువా, రెండవ ప్రపంచ యుద్ధాంతానికి అస్తిత్వవాదిగామారి అసలు ప్రపంచానికే అర్థంలేదు పొమ్మన్నాడు. ఒకనాడు సార్వజనీనత గురించి, సార్వకాలిక సత్యాల గురించి మాట్లాడిన బూర్జువా తనకు వ్యతిరేకంగా తిరగబడుతున్న సత్యాన్ని చూసి దడుసుకొని 'ప్రతి సత్యము క్షణికమే' అన్నాడు ('Every truth is a truth of the moment' – ఈ మాటలన్నది Heidegger కాబోలు)

సామ్రాజ్యవాదం క్షీణ బూర్జువాయుగం కాబట్టే మార్క్సిస్టులు అధివాస్తవికవాదంనుండి, అస్తిత్వవాదంనుండి, వాటి పుత్రపౌత్ర సమూహంనుండి పుట్టిన ఆధునిక పాశ్చాత్యసాహిత్యాన్ని క్షీణసాహిత్యమనీ, బూర్జువా సాహిత్యమనీ మాత్రమే కాకుండ, చాల శాస్త్రీయంగా క్షీణబూర్జువా సాహిత్యం అన్నారు. ఈ సాహిత్యం ఎదురుతిరిగింది బూర్జువా విలువలకు కాదు, సామ్రాజ్యవాద పూర్వయుగపు బూర్జువా విలువలయిన హేతువాదం, ప్రగతివాదం, యదార్థవాదం మొదలయినవాటికి. ఈ 'తిరుగుబాటు' బూర్జువా సమాజంలో సామ్రాజ్యవాద పూర్వయుగంనుండి సామ్రాజ్యవాద యుగానికి జరిగినమార్పుకు తాత్వికస్థాయిలోని గుర్తింపుమాత్రమే, అంటే ఆమార్పు బూర్జువా చైతన్యంలో ప్రతిబింబించబడ్డ తీరుమాత్రమే.

సురేంద్రరాజుకు చారిత్రకజ్ఞానం లేదుకాబట్టి, ఈ నికార్సయిన సామ్రాజ్యవాద బూర్జువా సాహిత్యానికీ, గతశతాబ్దంలో పెటీబూర్జువా వర్గదృక్పథమయిన కాల్పనిక వాదానికి తేడాతెలియలేదు. అసలు సామ్రాజ్యవాదం అంటే ఏమిటో తెలియకపోబట్టే దళారీ సాహిత్యాన్ని విమర్శించేవాళ్ళకి, పాశ్చాత్య ప్రభావాన్ని నిరసించే ఛాందసులకు తేడాలేదంటున్నారు.

అయితే ఈ క్షీణ బూర్జువాసమాజంలో 'ఉత్తమ' సాహిత్యం పుట్టదా అనిఅడగవచ్చు- మార్క్సు ఎంగెల్సులు రియాక్షనరీ అయిన బాల్జాక్‌ను మెచ్చుకోలేదా అనవచ్చు. ఇంతకీ మార్క్సు బాల్జాక్‌ను 'బూర్జువావిలువల్ని ధ్వంసంచేసినందుకు'కాదు మెచ్చుకుంది- మార్క్సు చారిత్రిక జ్ఞానహీనుడుకాడు, బూర్జువావిలువల్ని గర్హించే భూస్వామ్య చైతన్యాన్నిచూసి హర్షించడానికి.

వాస్తవాన్ని, అందులోని సామాజిక సంబంధాలను ఏ మాయలేకుండ (సిద్ధాంతం లేకుండ కాదు) ప్రతిబింబించే సాహిత్యానికి, చారిత్రికంగా అనివార్యమయిన మార్పును (వ్యక్తిగతంగా నచ్చినా నచ్చకపోయినా) అంగీకరించే దృక్పథానికి, ఒక విలువవుంటుంది. బాల్జాక్ సాహిత్యాన్ని తామీకారణంగానే మెచ్చుకున్నామని ఎంగెల్సు ఒక వుత్తరంలో స్పష్టంచేసాడు. 14

ఆధునిక పాశ్చాత్య సాహిత్యంలో ఇటువంటి రచనలు లేవా అంటె తప్పకుండ వున్నాయనే చెప్పాలి- ఉదాహరణగా అమెరికన్ రచయిత జోసఫ్‌హెల్లర్‌ను చెప్పుకోవచ్చు- యుగప్రతినిధిగా బూర్జువా ప్రపంచంచేత- మన దళారీ మేధావులతోసహా- స్తుతించబడుతున్న సాల్‌బెల్లోకన్నాటె నిజానికి హెల్లర్ రచనలకు ఎక్కువ విలువవుంది. బెల్లోవాస్తవాన్ని చూడలేక నకిలీ ఆధ్యాత్మికపు ముసుగువేసుకున్నాడు- హెల్లర్ రచనలు దానికి విరుద్ధంగా వర్తమాన అమెరికా సమాజానికి చక్కగా దర్పణం పడతాయి.

చెప్పొచ్చిందేమిటంటే క్షీణ బూర్జువా సాహిత్యంలో వైవిధ్యం లేదనికాదు, విలువయిన సాహిత్యం పుట్టదనికాదు- దానిని సీరియస్‌గా పరిశీలించవలసిన అవసరం లేదనీ కాదు- అసలు శత్రువును సంపూర్ణంగా కాకుండ పైపైనే అర్థంచేసుకునేవాడు యుద్ధమేంచేస్తాడు? 'పీపుల్సు పేపర్' పత్రిక వార్షికోత్సవ సందర్భంగా మార్క్సు చెప్పినవిగా సురేంద్రరాజు యిచ్చిన వాక్యాల అర్థంయిదే- అంతేగాని, ఆ సాహిత్యం యొక్క వర్గస్వభావం చూడవద్దనిగాదు, వర్గపోరాటంలో భాగంగా దాన్ని ఎండగట్టవద్దనీ కాదు- అసలు ఈ ఆధునిక సాహిత్యం పుట్టిన కొత్తలోనే లెనిన్ దీనిని నిర్ద్వంద్వంగా క్షీణసాహిత్యమని ఖండించాడు. 15

## చివరి మాట

మార్క్సిజం మతంకాదు, మార్క్సు మహమ్మదు వంటి ప్రవక్త కాదు- పెట్టుబడిదారి సమాజంలోని వైరుధ్యాల నుండి పుట్టిన గతితార్కిక భౌతికవాదం మొదటిగా మార్క్సు, ఎంగెల్సుల దృక్పథంలో రూపం తీసుకుంది- అయితే యిది ఒక్కరోజులో

జరగలేదు. 1848లో 'కమ్యూనిస్టు మానిఫెస్టో' రాసేకాలానికి వారి అవగాహన ఒక స్థాయికి చేరుకుంది. క్రమంగా సమకాలీన సమాజాన్ని, చరిత్రను, ప్రకృతిని విశ్లేషించడంతో మరింత ముందుకు పోయింది. అయితే ఒక విషయాన్ని విశ్లేషించాలన్నా సరిగ్గా అర్థంచేసుకోవాలన్నా దానికి సమకాలీన సమాజంలోనే ప్రేరణ వుండాలి. కాబట్టే పారిస్‌కమ్యూన్ రోజుల వరకు వర్గపోరాటానికి రాజ్యాంగయంత్రానికీ వున్న సంబంధం మార్క్స్‌కు సంపూర్ణంగా అర్థంకాలేదు. దీన్ని గురించిన సంపూర్ణమయిన అవగాహన 1871లో రాసిన 'సివిల్ వార్ ఇన్ ఫ్రాన్స్' అన్న రచనలో కనిపిస్తుంది. అందుకే లెనిన్ తన 'రాజ్యము – విప్లవము' అనే ప్రఖ్యాత సిద్ధాంత గ్రంథానికి ఈ రచననే ఆధారంచేసుకున్నాడు. అదే విధంగా జాతిసమస్య మార్క్స్ కాలంలో ముందుకు రాలేదు కాబట్టి (చరిత్రలో అది సామ్రాజ్యవాద కాలంలో ప్రధానంగా వుత్పన్నమయింది కాబట్టి) దాన్ని గురించి మార్క్స్ ఎక్కువగా చెప్పలేదు. ఆ పని లెనిన్ చేసాడు. ఇక సోషల్ సామ్రాజ్యవాదం ఎటువంటిదో మార్క్స్ వూహించనుకూడలేదు.

మార్క్సిజాన్ని అర్థంచేసుకునేప్పుడు యివన్నీ గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా మార్క్స్ 1840లలో చేసిన రచనలను (అంటే కమ్యూనిస్ట్ మానిఫెస్టోకుముందు రాసినవి) వాడుకునేటప్పుడు చాలమెలకువతో వ్యవహరించాలి. దానికి విరుద్ధంగా సురేంద్ర రాజు గాని యితర విమర్శకులుగాని ఆకాలపు రచనలనే ప్రమాణంగా తీసుకోవడం, పైగా సందర్భశుద్ధి పాటించకుండ కొటేషన్లు గుప్పించడం చేస్తున్నారు. ఇదంతా మార్క్సిస్టులను దూషించడానికి పనికివస్తుందిగాని ప్రపంచాన్ని అర్థంచేసుకోవడానికి, మార్చడానికి నిరుపయోగం. బహుశ వారిఉద్దేశ్యంకూడ అదేననుకోవాలి.

కె. బాలగోపాల్

15-3-81

1. సృజన, జూన్-జులై, అగస్ట్-సెప్టెంబర్, డిసెంబర్ 1980
2. సృజన, అగస్ట్, సెప్టెంబర్ 1979
3. F. Engels, 'Ludwing Feuerbach and the end of classical german philosophy', Marx-Engels Selected works, P. 613, Progress Publishers, Moscow, 1970.
4. F. Engels, Letter to J. Bloch, Sept. 21, 1890. Marx-Engels Selected works. P. 683.
5. K. Marx, 'The Eighteenth Brumaire of Louis Bonaparte,' Marx-Engels Selected works, P. 96.

6. V. I. Lenin, 'Frederick Engels', Marx-Engels Selected works, P. 18.
7. "Accumulate, accumulate, that is Moses and the Prophets!" -K. Marx, Capital, Vol. I, P. 595, Foreign Languages Publishing House, Mascow, 1961.
8. Marx-Engels, 'Communist Manifesto', Selected works, P. 38 ("The bourgeoisie cannot exist without constantly revolutionising the instruments of production......")
9, K. Marx, 'The Eighteenth Brumaire of Louis Bonaparte', Marx-Engels Selected works, P. 120.
10. K. Marx, Letter to P. V. Annenkov, Dec 28, 1846. Marx-Engels Selected works. P. 668.
11. K. Marx, 'Theories of Surplus Value', P. 291-292. Foreign Languages Publishing House, Moscow.
12. P. Baran and P. Sweezey, 'Monopoly Capital', Penguins, New Yark
13. A. G. George, 'T. S. Eliot, his mind and art,' Asia Publishing House, 1962.
14. F. Engels, Letter to Margaret Harkness, Marx Engels Selected Correspondence, p. 480, Foreign Languages Publishing House, Moscow,
15. V. Shcherbina, 'Lenin and problems of literature,' Progress Publishers, Moscow, 1974.

ఈ చర్చలో పాల్గొనదలచినవారు, ఈ చర్చను శ్రద్ధగా అవగాహన చేసకోదలిసినవారు అగస్టు 79 సంచికలో ఆర్. ఎస్. సుదర్శనం, 'మార్క్సు దృష్టిలో సాహిత్యం,' సెప్టెంబర్, అక్టోబర్ 79 సంచికలలో త్రిపురనేని మధుసూదనరావు 'మార్క్సిజం - సాహిత్యం,' జనవరి 80 సంచికలో నాసి, ఆర్. రవీంద్ర & మిత్రులు, జూన్ / జులై, ఆగస్టు / సెప్టెంబర్, డిసెంబర్ 80 సంచికల్లో సురేంద్రరాజు 'సాహిత్యం - మార్క్సిజం' చర్చను, వీరంతా ప్రస్తావించిన సాహిత్యాన్ని, అధ్యయనంచేస్తే ప్రయోజనకరంగా వుంటుంది. ఈ చర్చను సాహిత్యం - సమాజం సంబంధాల విశ్లేషణలో పాఠకుల అవగాహనకు పదనుపెట్టేదిగా కొనసాగించాలన్నదే మా ఆశయం.

'సాహితీమిత్రులు'